# రుచి చూసినది....



**"ఏయ్ వేణూ, ఏవిటీ నీ సంగతి?** నన్ను పెళ్ళి చేసుకోనన్నావుట?"

"ఎవరు చెప్పారు?"

"ఎవరు చెప్తేనేంలే, నిజమా, కాదా?"

"నిజమేననుకో...."

"ఏం నన్ను పెళ్ళాడానికేం మాయరోగం? చదువు లేదా, అందం లేదా?"

"ఛ, ఛ, అలా ఎవరన్నారు?"

"మరింకేం? ఫామిలీ ఫ్రెండ్స్‌మి. చిన్నప్పట్నుంచి కలిసి, మెలసి ఆడాం, పెరిగాం. ఒకర్నొకరు అర్థం చేసుకున్నవాళ్ళం. మా అమ్మా, నాన్నా వచ్చి అడిగితే మీ వాళ్ళు నీ ఇష్టం అన్నారట. నువ్వేమో

ఎమ్బీయస్ ప్రసాద్

ఇలా..."

"ప్లీజ్, నువ్వు మరోలా అనుకోకు. ఓ చిన్న అభ్యంతరం వల్లనే కుదరదన్నాను."

"ఏమిటీ? నీ కంటే ఓ ఏడాది పెద్దదాన్ననేగా!"

"మరింకేం? అన్నీ తెలిసి నువ్వలా డైరెక్టుగా అడిగితే ఏం చెప్పాలి?"

"పెద్దదాన్నయితే సంసారానికి పనికిరానా?"

"ఇంత సీరియస్ విషయంలో కూడా నీ చిలిపితనం పోదు కదా. మనం మాట్లాడేది సంసారం గురించి కాదు, పెళ్ళి గురించి."

"పెళ్ళి గురించేనయ్యా అడుగుతున్నాను. ఎక్కడో ఢిల్లీలో నీ ఉద్యోగం. పెళ్లయాక ఝూమ్మని అక్కడికి వెళ్లిపోతాం. అక్కడందరికీ నువ్వే పెద్దవాడవని చెప్పుకో. ఇక్కడ మనవాళ్ళు నాలుగు రోజులు కనుబొమలెగరేస్తారు. ఆ తర్వాత కళ్ళు నొప్పిపుట్టి వాళ్ళే మానుకుంటారు."

"ఇప్పుడు సరే. కొన్నేళ్లు పోయాక, అంటే మిడిల్ ఏజ్ వచ్చాక, మన మధ్య తేడా బాగా కొట్టవచ్చినట్టు కనబడదూ? పురుళ్ళ వల్ల ఆడవాళ్ళు లావెక్కి, పెద్దవాళ్లుగా కనబడతారంటారుగా. నువ్వసలే పెద్దదాని...."

"తగ్గవోయ్, అదంతా పాతకాలం మాట, ఈ కాలంలో మగాళ్ళని చూడు. బాన బొజ్జలు, బట్టతలలు పెరిగిపోయి ముందే ముసలాళ్ళయి పోతున్నారు. ఆడాళ్ళు బ్యూటీ క్లినిక్‌ల కెళ్ళి ట్రిమ్‌గా, యూత్‌ఫుల్‌గా ఉంటున్నారు. అలా చూస్తే నా కంటే కనీసం ఐదేళ్ళు చిన్నవాణ్ని చేసుకోవాలి. పోనీ కదాని...."

"అదిగో చూసావా, నువ్వు నన్ను బాసింగ్ చేస్తున్నావు. నా కంటే పెద్దదానివనేగా. చిన్నప్పుణ్నుంచీ ఇంతే. లెక్కలు నేర్పేటప్పుడు మొట్టికాయలు వేసేదానివి, ఎర్రచొక్కా వేసుకుందామంటే నీకు నప్పదు అని డబాయించేసేదానివి. నాకు ఫుట్‌బాల్ ఇష్టమంటే, 'కాదు క్రికెట్‌టీములో చేరు' అని బలవంతంగా చేర్పించేవు. పెద్దదానివి కదాని నువ్వు చెప్పిన మాటల్లా వినేసేవాణ్ని. రేపు భార్యవయితే ఇక చెప్పనే అక్కర్లేదు. 'కుర్ర సన్నాసివి, నీకేమి తెలీదు, ఊరుకో' అనేసి డామినేట్ చేసేస్తావు."

"ఇదిగో బుచ్చుబ్బాయి, ఒకటి తెలుసుకో. నువ్వు నా మాట విన్నది, నా మీద అభిమానంతో, ప్రేమతో. మీ అమ్మగారు నాకంటే పెద్దవారు. ఆవిడ మాట విన్నావా? ఇక నిన్ను డామినేట్ చేయడమంటావా, నిన్ను ఎవరు చేసుకున్నా డామినేట్ చేయడం ఖాయం. నువ్వలాంటి బుద్ధావతారానివి."

"అలాగేం, పోన్లే. నేను బుద్ధావతారాన్నని నేను ఆ కొత్తమ్మాయికి తెలియడానికి కొంత టైము – ఏడాదో, రెండేళ్ళో పడుతుంది కదా, అప్పటిదాకానైనా నేను డామినేట్ చేస్తాను."

"నువ్వలా ఉడుక్కున్నావంటే, పెళ్ళినాడే ఆ అమ్మాయికి నీ సంగతంతా చెప్పేస్తా. ..పోన్లే, ఇదంతా ఎందుకు గానీ, నిజంగా చెప్పు. నేను నీకు వద్దా? పెళ్ళి చేసుకోవా?"

".... నువ్వు సీరియస్‌గా అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను. నువ్వు నా కంటే వయస్సులో పెద్ద అనే విషయం నాకు మనసులో మెదలుతూనే ఉంటోంది. ఐ కాంట్ హెల్ప్ ఇట్. అందుకే మనం ఫ్రెండ్స్‌గా మిగులుదాం. నీ మనసు నొప్పిస్తున్నందుకు సారీ."

"ఇదే నీ అంతిమ నిర్ణయమయితే అలాగే కానీ. కానీ ఓ చిన్న రిక్వెస్టు. ఫ్రెండ్స్‌గా మిగులుదామంటున్నావు గానీ, ఆ పని జరగదు. పెళ్ళయ్యాక, నీ భార్య నన్ను దగ్గరకు రానివ్వదు. భర్త ఆత్మీయురాలంటే భయపడదూ! మళ్ళీ ఎప్పుడూ కలుస్తామో తెలీదు. అందుకని ఓ చిన్న 'గుడ్‌బై కిస్'. ఖంగారు పడకు. నిన్ను పెట్టమననులే. నువ్వు జంకుతావని తెలుసు. నేనే పెడతాను. కాస్సేపే! భరించు."

ఆమె అతని భుజం మీద చేతులేసి దగ్గరకు లాక్కుంది. చేతులు జార్చి, వీపు చుట్టివేసింది. తన ఛాతీకి అదుముకుంది. ఒక చేయి తల వెనక్కు పోనిచ్చి తలను వంచింది, అతని పెదాలు తన పెదాలపై అనేటట్లు. తల వెనక్కాల నున్న చెయ్యి కిందకు జారి, వీపు మీదున్న చేయి పైకి ఎగబాకి, రెండూ కలిసి అతని మెడను చుట్టివేసాయి. అతని చేతులు ఆ ప్రయత్నంగానే ఆమె నడుమును

చుట్టివేసాయి. ఆమె పెదాల బిగింపు ఉధృతమైన కొద్దీ ఆ చేతులు కిందకు జారి ఆమెను తనలో కలుపుకోజూసాయి.

ఆమె కళ్ళు తెరిచింది. కౌగిలి సడలించింది. ఒకడుగు వెనక్కివేసింది.

"గుడ్‌బై వేణూ, ఇంటి కెళతాను. ఇవాళ రాత్రేగా నీ ప్రయాణం. ఈ జన్మ కిది చాలు. కొద్దిరోజుల్లో నువ్వు పరాయి సొత్తువయిపోతావుగా."

వేణు మత్తులోంచి బయటపడడానికి ప్రయత్నిస్తున్నట్లు తల విదిల్చాడు. నోరు పెగల్చుకున్నాడు. "ఆగాగు, ఒక్క విషయం చెప్పు. ఇంతకింతయితే, అంత కెంత?" అన్నాడు కళ్ళు పెద్దవి చేసి.

ఆమె చిరునవ్వు నవ్వింది. అంతలోనే పెదాలు బిగించి, మూతి తిప్పింది. " ఎంతయితే నీకెందుకులే, ఎలాగూ దక్కనప్పుడు.." అనేసి విసవిసా వెళ్ళిపోయింది.

"అదేమిటి వేణూ పొద్దున్నే మా ఇంటి కొచ్చావు. నిన్న రాత్రి ప్రయాణం..."

"..టిక్కెట్ కాన్సిల్ చేసుకున్నాను. పెళ్ళి విషయం ఫైనలేజ్ చేసుకొని వెళదామని ఆగేను."

"కంగ్రాట్స్, ఎవరా పెళ్ళికూతురు?"

"నువ్వే... బిలీవ్ మీ.... ఒక్క రోజులో నిర్ణయం ఎలా మారిందని క్లాసు తీసుకోకు."

"తీసుకోనులే. అయినా అంత సడన్‌గా..."

"దేన్నైనా కోల్పోయేదాకా దాని రుచి తెలియదు. డయాబెటిస్ వచ్చింది. పంచదార వేసుకోద్దని డాక్టరంటే చాలు, పంచదార మీద వ్యామోహం పెరిగిపోతుంది. అసలు పంచదార రుచే తెలీదనుకో, మనం ఏం 'మిస్' అవుతున్నామో తెలియదు. అప్పుడు బాధే ఉండదు. తెలిస్తేనే బాధ. అనుకోకుండా నువ్వు నీతో శృంగారం ఎలా వుంటుందో కాస్త రుచి చూపించేవు. దాన్ని తలచుకున్నప్పుడల్లా 'అమ్మో, ఇది జీవితాంతం పోగొట్టుకోవడమా?' అని అనిపించి మనసు వెంపర్లాడింది. అభ్యంతరాలను పక్కకు నెట్టేసింది. ఇంట్లో చెప్పేసా. ఇవాళ రాత్రి ట్రైనెక్కి వెళ్ళాలి. మళ్ళీ పెళ్ళికే రావడం."

"పోన్లే తెలివైన పని చేసావు."

"మెచ్చుకున్నావు కాబట్టి ఇప్పుడు గుడ్‌బై కిస్ నన్ను పెట్టనివ్వాలి,"

"పెట్టనిస్తా గానీ ఓ షరతు. నువ్వు రాత్రి కదా రైలెక్కడం, మధ్యాహ్నం ఒకసారి, సాయంత్రం ఇంకోసారి వచ్చి గుడ్‌బై చెప్పాలి. నరేనా?"

(ఆంధ్రప్రభ వీక్లీ జనవరి 1998)

# ఆలూమగలీయం

## ఇంద్రజోస్యం

> 2000 లో డి.ఆర్.ఇంద్ర రాసిన "రావణజోస్యం" కథ ప్రచురించిన పత్రికాఫీసుపై దాడి - వార్త

"ఇదిగో, చూడేం తెచ్చానో, 'రావణజోస్యం' అనే పుస్తకం గురించి విన్నావేమో అదే ఇది!"

"బ్రహ్మంగారి జోస్యాలు విని, విని ప్రళయం వచ్చేస్తోందని హడిలి ఛస్తూంటే రావణాసురుడు కూడా మొదలెట్టాడూ.."

"నువ్వొకత్తివి. ఇది అలాటిది కాదు. సీత మనోగతం అన్నమాట! రాముడితో తనెంత అవస్థలు పడుతోందో, రాముడి పద్ధతులు తన కెందుకు నచ్చవో సీత రావణుడితో ముచ్చటిస్తుందన్నమాట.."

"సీతమ్మవారి ఖర్మ కాలిందంటే ఇదే కాబోలు! పోయి, పోయి రావణాసురుడితో చెప్పుకోవడమా? ఆర్చేవాడా? తీర్చేవాడా?"

"తీరుస్తాడని కాదు. జస్ట్ యాజ్ ఏ ఫ్రెండ్... అలా అశోకవనంలో విహరిస్తూ చెబుతుందన్నమాట! అశోకవనం పాడు చేసినందుకు హనుమంతుడి మీద చికాకు పడుతుంది కూడా!"

"సీతమ్మవారికి అదేం బుద్ధండీ? మొగుడి గురించి ఏవైనా ఫిర్యాదులంటే ఆడది తల్లికి చెప్పుకుంటుంది, తోడబుట్టినవాళ్లకు చెప్పుకుంటుంది. రావణాసురుడుకి చెబితే చంకలు గుద్దుకుని ఎప్పటికైనా తనవైపు మొగ్గుతుందని ఆశ పెట్టుకోడూ? ఊరించి రెచ్చగొట్టినట్టవదూ?"

"నన్ను పుస్తకం గురించి చెప్పనిస్తావా? లేదా? 'రాముడు అగ్నిపరీక్ష పెట్టి నిన్ను అవమానిస్తాడు చూడు' అని రావణుడు జోస్యం చెబుతాడన్నమాట. సరిగ్గా అలాగే జరిగింది కదా!"

"నిజంగా రావణుడు అలా చెప్పాడండి? ఎక్కడా వినలేదు."

"అది రచయిత ఇంద్రగారి ఊహ అన్నమాట. కానీ వాల్మీకి రామాయణం ప్రకారం రాముడు కూడా ఆ టైములో ఏమన్నాడో వెనుక అట్ట మీద రాసారు చూడు – 'నువ్వు నా కక్కరలేదు, కావాలంటే లక్ష్మణుడినో, సుగ్రీవుణ్నో కట్టుకో' అన్నాడు. ఒక మగవాడిగా రాముడు అన్న మాటలకు నేను సిగ్గుపడుతున్నాను."

"మాయలేడి అరిచినప్పుడు లక్ష్మణుడు వెళ్లనంటే సీతాదేవి కూడా దారుణంగా, 'మీ అన్న చచ్చిపోతే నన్ను పెళ్లాడాలని కాసుక్కూచున్నావు' అందిటగా! దానికి ఒక ఆడదానిగా నేను సిగ్గుపడమంటారా ఏమిటి?"

"నేను పోనీ కదాని స్త్రీల పక్షాన మాట్లాడుతూంటే నువ్వు అలా వంకరటింకరగా మాట్లాడతావేమిటి?"

"పోనీకదా ఏమిటి? మీరు ఉద్ధరించకపోతే సీతాదేవికి వచ్చిన లోటేమీ లేదు! రాముడితో సమానంగా ఆవిడా పూజలందుకుంటోంది, 'నను బ్రోవమని చెప్పవే' అనే సిఫార్సులు కూడా!"

"సర్లే, నీతోనే వాదించాలి! ఇంతకీ చెప్పవచ్చేదేమంటే ఆ కథను ఓ పత్రికవాళ్లు సీరియల్‌గా వేస్తూ ఉంటే కొంతమంది మత ఛాందసవాదులు వచ్చి అక్కడ వాళ్లను కొట్టి, రచయితని చంపుతామని రంకెలు వేసారట.."

"బజరంగబలి ఆగడాల గురించి అంత తెలిసిన ఇంద్రగారు ఆయన దళం సభ్యుల సంగతి పత్రికల వాళ్లకి జోస్యం చెప్పలేకపోయాడా?"



"ఇంతకీ నువ్వు వాళ్ల అఘాయిత్యాల గురించి ఖండిస్తావా? లేదా?"

"ఖండికపోవడమేం? సీతమ్మ తల్లి వాళ్ల పని పడుతుంది లెండి"

"..ఆ ఛాందసమే పనికిరాదు."

"ఏమోనండి. నాకు మాత్రం సీత ఆదర్శమూర్తే! కోపం వచ్చినప్పుడల్లా మొగుణ్ని కడిగిపారేసేదని మా నాయనమ్మ పురాణాలు చదివి చెప్పేది. చివర్లో రాముడు బతిమాలినా 'పోవోయ్' అని భూమిలోకి వెళ్లిపోయింది..."

"..ఇదా నీ ఆదర్శం? సర్లే, అదంతా పక్కనబెట్టు. మా ఫ్రెండ్సంతా కలిసి ఈ పుస్తకం వేసేరు. ఓ వంద పుస్తకాలు పట్టుకొచ్చేను. ఇరుగమ్మ, పొరుగమ్మలలో పురుషహంకారం గురించి అవేర్‌నెస్ కలిగించి యివి కాస్త అమ్మిపెట్టు."

"...నా వల్ల కాదండోయ్. నాకు ఇంట్లో చచ్చేటంత పని!"

"గాడిదగుడ్డు పని! అవున్లే! నేను చెబితే ఎందుకు చేస్తావ్? పక్కింటి లక్ష్మణరావు వచ్చి 'మేడమ్, మా చిట్‌ఫండ్ కంపెనీలో మీ ఫ్రెండ్స్‌ని మెంబర్లుగా చేర్పిస్తారా?' అంటే ఎగురుకుంటూ చేస్తావు..."

"...ఏమండోయ్, మీరిందాకా చూపించారు పుస్తకం వెనక అట్ట మీద, ఏదీ రాముడన్నాడు అంటూ... అదీ ఇదేగా! మీరిప్పుడే ఇలా మాట్లాడుతూ ఉంటే, కొన్ని వేల యేళ్ల క్రితం ఆయన అంత మాత్రం పురుషహంకారమే చూపాడంటే మెచ్చుకోవాల్సిందే! అందుకే ఆయనకో దణ్ణం! మీకూ ఓ దండం – నన్నొదిలి పెట్టండి. మీరొప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నాకు బోల్డంత పని ఉంది."